పచ్చిరొట్ట సాగు.. భూమికి మేలు

- పచ్చిరొట్ట ఎరువుతో నేల సారవంతం
- మొక్కలకు అవసరమైన పోషకాల లభ్యత
- సాగుకు ఇదే సరైన సమయం
- 50 శాతం రాయితీతో రైతుసేవ కేంద్రాల్లో అందుబాటులో విత్తనాలు



సాగుచేసిన జీలుగ పంట

గడివేముల: పంటల సాగులో అధిక మోతాదులో వేసే రసాయన ఎరువులతో భూములు నిస్సార మవుతాయి. పచ్చిరొట్ట పైర్ల సాగుతో పెట్టుబడులు తగ్గడమే కాకుండా పంట దిగుబడులను పెంచుకోవచ్చని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. వరి సాగుకు ముందు పచ్చిరొట్ట పైర్ల సాగు నేలకు ఎంతో మేలు చేస్తుందని, భూముల్లో సేంద్రియకర్బనం పెరిగి పంట దిగుబడులు పెంచుకోవచ్చని చెబుతున్నారు.

అందుబాటులో సబ్సిడీ విత్తనాలు

గడివేముల మండలంలో ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 22 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తారు. ముఖ్యంగా వరిపంట 10 వేల ఎకరాల దాకా సాగవుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మండలానికి 150 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. కిలో రూ.88 అమ్ముతుండగా 50 శాతం సబ్సిడీతో రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. పిల్లి పెసర రూ.134తో కేజీ ఉండగా 50 శాతం సబ్సిడీతో అందజేస్తారన్నారు. కావాల్సిన రైతులు రైతుసేవ కేంద్రాల్లో సంప్రదించి గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా డి–క్రిష్ దరఖాస్తులో రిజిస్ట్రేషన్ చేయించుకొని రైతు వాటా డబ్బులు చెల్లిస్తే ఏపీ సీడ్స్ ద్వారా నాణ్యమైన విత్తనాలు అందజేస్తారని చెప్పారు.

పచ్చిరొట్ట వల్ల లాభాలు

వరిపంట వేసే పొలంలో పచ్చిరొట్ట ఎరువులైన జీలుగలు, పిల్లి పెసర, జనుము, పంటలను వేసి పూత సమయంలో కలియ దున్నడం వల్ల నేల సారవంతమై అధిక దిగుబడులు సాధించడానికి దోహదం చేస్తాయి. దీంతో భూసారం పెరుగుతుంది. భూమి బాగా గుల్ల బారుతుంది. భూమిలో స్థూల సూక్ష్మపోషకాల లభ్యత పెరుగుతుంది. భూమికి తేమను ఎక్కువ రోజులు నిలుపుకునే శక్తి వస్తుంది. పంట నాణ్యత పెరుగుతుంది. పంటకు మార్కెట్లో మంచి ధర పలుకుతుంది. పచ్చిరొట్ట పైర్లకు వేరు బుడిపెలు ఉండటం వల్ల నత్రజనిని స్థిరీకరిస్తాయి. సారవంతమైన నేలలను చౌడు భూములుగా మారకుండా నివారిస్తాయి. ఒకవేళ భూముల్లో ఏదైనా లవణాల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పుడు లవణాలను తగ్గించి సారవంతమైన భూమిగా చేస్తాయి.

పచ్చి ఆకు ఎరువు

పచ్చిరొట్ట ఎరువును పండించడానికి అవకాశం లేనప్పుడు పచ్చిరొట్ట చెట్ల ఆకులు, లేత కొమ్మలు బయటి నుండి తెచ్చి పొలంలో వేసి కలియదున్నాలి. తగినంత నీరు పెట్టి కుళ్ల నివ్వాలి. ఉదాహరణకు నేల తంగెడి, సుబాబుల్, గానుగ, తదితరాలు.

జీలుగల సాగు..

జీలుగపైరును తేలికపాటి నేలల్లోను, ఇసుక నేలల్లో కూడా సాగు చేసుకోవచ్చు. ఎక్కడైనా చౌడు భూములు ఉన్నట్లు అయితే అక్కడ కూడా సాగు చేయవచ్చు. చౌడులో ఉన్న లవణాలను తీసివేసి మంచి భూమిగా తయారు చేయడానికి ఈ జీలుగ పైరు ఉపయోగపడుతుంది. జీలుగ నుంచి ఎకరానికి ఐదుటన్నుల పచ్చిరొట్ట ఎరువు వస్తుంది. ఇది నీరు ఇంకిపోయే తేలికపాటి ఎర్రనేలల్లో, ఇసుక నేలల్లో బాగా పెరుగుతుంది. జనుమును పచ్చిరొట్ట ఎరువుగాను, పశువులకు మేతగాను ఉపయోగపడుతుంది. జనుము పైరు త్వరగా పెరిగి మృదువైన ఆకులను ఇస్తుంది. ఎకరానికి 15కిలోల విత్తనం అవసరం. పైరు పూతకు వచ్చే సమయంలో భూమిలో కలియదున్నాలి. ఎకరానికి 5–6టన్నుల పచ్చిరొట్ట ఎరువు వస్తుంది. ఐదుటన్నుల పచ్చిరొట్ట ఎరువులో 16–24కిలోల నత్రజని ఉంటుంది. అంతేగాకుండా 7.5కిలోల భాస్వరం, 20కిలోల పొటాష్ వస్తుంది.

పచ్చిరొట్ట ఎరువుల ఎంపికలో జాగ్రత్తలు

పచ్చిరొట్ట పైర్లు త్వరత్వరగా పెరిగి ఆకులు ఎక్కువ వచ్చి కాండం మెత్తగా ఉండాలి. కాండం మృదువుగా ఉండి త్వరగా కుళ్లే స్వభావం కలిగి ఉండాలి. అన్ని నేలలకు నీటి ఎద్దడికి తట్టుకునేలా ఉండాలి. తక్కువ సారమున్న నేలల్లో కూడా ఏపుగా పెరిగి పచ్చిరొట్టనిచ్చేదిగా ఉండాలి. పచ్చిరొట్ట పైర్ల వేర్లు భూమిలోకి లోతుగా చొచ్చుకొని పోయే గుణం కలిగి ఉండాలి.

పోషకాలు ఇలా..

జనుము, జీలుగ, పిల్లి పెసర తదితర రకాలను ఖరీఫ్, రబీకి మధ్య సాగు చేసుకోవాలి. వీటిని పూత దశ వరకూ పెంచి ఖరీఫ్ పంట వేసే ముందు భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలు అధికంగా ఉంటాయి. నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం, భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 నుంచి 2 శాతం వరకూ ఉంటాయి. స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు సైతం భూమికి లభిస్తాయి. పచ్చిరొట్ట సాగుతో 30 శాతం రసా యన ఎరువుల వినియోగం తగ్గుతుంది.

భూసారం పెరుగుతుంది



పచ్చిరొట్ట పైర్లతో ఎంతో మేలు. పచ్చి రొట్ట పైర్లను భూమిలో కలిగియదున్నడంతో సూక్ష్మ జీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. సహజంగా చౌడు బారిన భూముల్లో జీలుగ వేసుకుంటే భూసారం పెరిగి పంటకు అనుకూలంగా మారుతుంది. పైగా రసాయనిక ఎరువుల వినియోగం సైతం తగ్గుతుంది. రసాయన ఎరువుల వాడకం తగ్గించటమే లక్ష్యం సేంద్రియ ఎరువుల వాడకంతో భూమి నిర్జీవంగా మారకుండా నిరోధించవచ్చు. 50 శాతం రాయితీతో వీటిని అందుబాటులో ఉంచుతున్నాం.

–హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం



వందలాది మంది భక్తుల మధ్య సాగుతున్న లక్ష్మీచెన్నకేశవస్వామి రథోత్సవం

గడివేముల: గడివేముల శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి రథోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. అర్చకులు హేమకేశవయ్య రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసిన అనంతరం ఉత్సమూర్తులను రథంపై కొలువుచేశారు. స్వామివారి రథాన్ని వివిధ రకాల పూలతో అలంకరించారు. రథం ముందు యువకులు చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అంతకుముందు స్వామివారికి అభిషేకం, ధూపదీప నైవేద్యములు, మహాసుదర్శన యాగం వంటి విశేష పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తుల కోలాహలం, కళాకారుల ప్రదర్శన మధ్య స్వామి రథాన్ని లాగారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

క్లుప్తంగా

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డును పరిశీలిస్తున్న సీఈ కబీర్‌బాషా

పాణ్యం : పాణ్యం డొంగు–దుర్వేశి మెట్ట వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను సీఈ కబీర్ బాషా, ఈఈ సుభకుమార్ మంగళవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అనంతరం నూతనంగా చేపట్టిన కాంక్రీట్ పనులు, బీటీ(తారురోడ్డు), సైడ్ గ్రావెల్ చదును పనులను పరిశీలించారు. వీటి పనులు పూర్తి చేసి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల వేగ నియంత్రణకు గ్రామాల వద్ద స్పీడ్‌బ్రేకర్లు , సూచిక బోర్డులు కచ్చింతగా ఏర్పాటు చేయాలన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



ఉత్సవ విగ్రహాలకు చూర్ణ స్నపనం చేయిస్తున్న పురోహితులు

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు, శకునాల గ్రామాలలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. గ్రూపు దేవస్థానం ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాల ముగింపు రోజున ఉదయం వసంతోత్సవం, మధ్యాహ్నం స్వాముల వారి ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా పూజలు జరిపి చూర్ణ స్నపనం చేయించి పూర్ణాహుతి చేశారు. సాయంత్రం 6 గంటలకు పారువేట కార్యక్రమంతో ఉత్సవాలకు ముగింపు పలికారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, వెంకటరమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, పురోహితులు విష్ణుశర్మ, నారాయణరావు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలు మరువలేనివి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఈఓ శామ్యూల్‌పాల్

కర్నూలు కల్చరల్: దేశ రక్షణ కోసం సైనికులు చేసిన త్యాగాలు మరువలేనివని జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్‌పాల్ అన్నారు. జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా మంగళవారం రాత్రి జరిగిన నృత్య ప్రదర్శనలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భరతమాత చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి నాట్యాచార్యులు నారాయణస్వామి, నాగ సాయిప్రదీప్, దేవిశ్రీ, కరీముల్లా, రోహిత్‌లను సత్కరించి పారితోషికం అందజేశారు. డీఈఓ శామ్యూల్ పాల్ ప్రసంగిస్తూ రాయలసీమ వాసి అయిన మురళీనాయక్ వీర మరణాన్ని కొనియాడారు. ఆయనను ధైర్యశాలిగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులను కొనియాడారు.

బాధిత కుటుంబాలకు చేయూత

కర్నూలు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో పనిచేస్తూ విధి నిర్వహణలో మూడు మాసాల క్రితం ఇద్దరు కానిస్టేబుళ్లు మృతిచెందారు. దీంతో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న సిబ్బంది జీతాల నుంచి రూ.2.08 లక్షలు నగదు పోగు చేసి ఒక్కో కుటుంబానికి రూ.1.04 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు. పంచలింగాల చెక్‌పోస్టులో రామకేశవులు, మాధవరం చెక్‌పోస్టులో శ్రీనివాస్ సింగ్ విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందారు. అసోసియేషన్ సభ్యులంతా కలసి తమ జీతాల్లో నుంచి నగదును పోగు చేసి రామకృష్ణ భార్య సువర్ణకు రూ.1.04 లక్షలు, శ్రీనివాస్ సింగ్ భార్య ఉమాబాయికి రూ.1.04 లక్షలు నగదును డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి చేతుల మీదుగా అందజేశారు.

హత్యకేసు నిందితుల అరెస్టు

కర్నూలు: కర్నూలు మండలం భూపాల్‌నగర్‌కు చెందిన బర్రెల కాపరి రఫిక్ (30) హత్య కేసులో ముగ్గురు మైనర్లను కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. రఫిక్ కొన్నేళ్లుగా బర్రెల పెంపకంతో జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు సంతానం. రఫిక్ ఈ నెల 8వ తేదీన బర్రెలు మేపడం కోసం పడిదెంపాడు గ్రామ పొలాల్లోకి తీసుకెళ్లాడు. అదే సమయంలో అక్కడ ముగ్గురు మేకల కాపరులు కూడా ఉన్నారు. మధ్యాహ్న సమయంలో ఒకరికొకరు మాట్లాడుకుంటూ మేకల కాపరుల్లోని ఒకరి సోదరుడిని కించపరుస్తూ రఫిక్ మాట్లాడినందుకు ఆవేశానికి లోనై చేతిలో ఉన్న కర్రతో బాది మేకలకు మేత కోసేందుకు తెచ్చుకున్న కొడవలితో గొంతు కోసి హత్య చేశారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పక్కా ఆధారాలతో ముగ్గురు మైనర్లను అరెస్టు చేసి జువైనల్ కోర్టులో హాజరుపరచినట్లు పోలీసులు తెలిపారు.

కబడ్డీ పోటీల విజేత ముల్లమల్లు



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఓర్వకల్లు : మండలంలోని నన్నూరు గ్రామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో ముల్లమల్లు జట్టు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి విజేతగా నిలిచినట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. స్థానిక ఏబీఎం చర్చి ప్రతిష్ఠోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం నిర్వహించిన పోటీలు రాత్రి ముగిశాయి. పోటీలలో 22 జట్లు పాల్గొనగా ఇందులో ముల్లమల్లు కబడ్డి జట్టు తొలిస్థానంలో నిలువగా నన్నూరు బాలాజీ వైన్స్ గ్రూపు వారు రూ.40 వేల బహుమతిని అందజేశారు. రెండవ స్థానంలో నిలిచిన హంటర్స్ జట్టుకు అజాంఖాన్ రూ.30 వేలు, మూడవ స్థానంలో గెలిచిన గోనెగండ్ల జట్టుకు తలారి విజేయుడు రూ.20 వేలు, నాల్గవ స్థానంలో గెలిచిన కాల్వబుగ్గ జట్టుకు హరి రూ.10 వేలు, ఐదవ స్థానంలో నిలిచిన తిరుపతి జట్టుకు కటిక హసన్ రూ.5 వేలు, ఆరవ స్థానం సాధించిన బిట్స్ అండ్ శ్రీరామ(నన్నూరు) జట్టుకు శంషుద్దీన్ రూ.3 వేల చొప్పున బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏబీఎం సంఘపెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భూసేకరణ కేసులు త్వరగా పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): భూ సేకరణ కేసులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో భూసేకరణకేసుల పురోగతిపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కర్నూలు, ఆదోని, పత్తికొండ డివిజన్ల వారీగా ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏ మండలంలో ఎన్ని కేసులు ఉన్నాయి? ఎంత పరిహారం చెల్లించాల్సి ఉందని ఆయా ఆర్‌డీఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భూసేకరణకు సంబంధించి కేసులపై తక్షణం స్పందించాలని అధికారులను ఆదేశించారు. పరిహారం చెల్లింపులకు సంబంధించిన కేసులు ఉంటే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. ఈ అంశంపై ఎప్పటికప్పుడు సమీక్షించాలని జేసీ డాక్టర్ బి.నవ్యకు సూచించారు. శాఖల వారీగా ఏఏ కేసులు ఉన్నాయి; ఎంత పరిహారంచెల్లించాలన్న నివేదికను సిద్ధం చేయాలని డీఆర్వో సి.వెంకట నారాయణమ్మను ఆదేశించారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

జిల్లాలో తాగునీటి ఎద్దడి తలెత్తకండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలో తాగునీటి సరఫరాపై ఆర్‌డీఓలు, ఎంపీడీఓలు, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఇంజినీర్లు, మునిసిపల్ కమిషనర్లు, ఈఓఆర్డీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మే నుంచి జూలై వరకు ఎక్కువగా తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని, ఎక్కడా ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పత్రికల్లో తాగునీటి ఎద్దడిపై వచ్చే కథనాలపై స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ సమీక్ష చేసుకోవాలని, రక్షిత మంచినీటి పథకాలు, ట్యాంకులు, ఫిల్టర్లు, పంపిణీ వ్యవస్థ సరిగా ఉందో లేదో చూసుకోవాలన్నారు. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల నిధులను వినియోగించుకొని నీటి పథకాలకు మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలన్నారు. ఆలూరు, ఆస్పరి, తుగ్గలి, మంత్రాలయం, గోనెగొండ్ల, కౌతాళం, ఎమ్మిగనూరు, నందవరం, కోసిగి, హోళగుంద తదితర మండలాల్లో తాగునీటి ఇబ్బందులపై పత్రికల్లో వచ్చిన కథనాలపై అధికారులతో ఆరా తీశారు. పట్టణాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలనిమునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్‌డీఓ సందీప్‌కుమార్, పత్తికొండ ఆర్‌డీఓ భరత్‌నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, ఇరిగేషన్ ఎస్‌ఈ బాలచంద్రారెడ్డి పాల్గొన్నారు.

రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కల్లూరు: మండలంలోని ముస్లిం, క్రిస్టియన్, బుద్దిస్ట్, సిఖ్, జైన్, పార్సీ (మైనారిటీలు)ల్లో అర్హులైన వారు స్వయం ఉపాధి పథకాలకు ఆన్‌లైన్‌లో ఈ నెల 25 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ నాగేషాచలరెడ్డి మంగళవారం ఒ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు సంబంధిత గ్రామ సచివాలయములో సంప్రదించాలన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

కల్లూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేసిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. మంగళవారం కర్నూలు నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పాడి రైతులకు సబ్సిడీపై దాణా

కర్నూలు(రూరల్): కరువు నివారణ చర్యల్లో భాగంగా పాడి రైతులకు 50 శాతం సబిడీస్తో పశువుల దాణా అందజేస్తున్నట్లు గార్గేయపురం పశువైద్యాధికారి రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 50 కిలోల పశువుల దాణా రూ.1,110 కాగా 50 శాతం సబిడీస్తో రూ.555కు ఇస్తున్నట్లు చెప్పారు. దాణా కావాల్సిన రైతులు ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో పశు సంవర్ధక శాఖ సిబ్బందిని సంప్రదించి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(రూరల్): కొత్త రేషన్ కార్డులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కర్నూలు రూరల్ తహసీల్దార్ టీవీ రమేష్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేషన్ కార్డులో కొత్త సభ్యుల నమోదు, అడ్రసు మార్పులు, చేర్పులు, మరణించిన వారి పేర్లు తొలగింపు చేస్తున్నామన్నారు. ప్రజా సాధికారిక సర్వేలో పేర్లు ఉన్న వారు ఇందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పెద్దకొట్టాల వృషభాల జయకేతనం



బండ లాగుతున్న ఎద్దులు

ఓర్వకల్లు : మండలంలోని నన్నూరు గ్రామంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగు పోటీలు హోరాహోరీగా సాగాయి. గ్రామంలోని నూతన ఏబీఎం చర్చి ప్రతిష్ఠ సందర్భంగా సంఘపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను స్థానిక సంఘకాపరి రెవ.ఎస్. ప్రసాద్ ప్రారంభించారు. పోటీలలో మొత్తం 13 ఎడ్ల జతలు పాల్గొనగా నంద్యాల జిల్లా, పెద్దకొట్టాలకు చెందిన బోరెడ్డి నారాయణరెడ్డి, ప్రొద్దుటూరుకు చెందిన జేసీఎస్‌ఆర్ బుల్స్(విడిజత) వృషభాలు మొదటి బహుమతి రూ.60 వేలను కై వసం చేసుకోగా, ఖజాపురానికి చెందిన తీగనాటి ఓసూరారెడ్డి ఎద్దులు రెండవ బహుమతి రూ.40 వేలు దక్కించుకున్నాయి. కర్నూలు జిల్లా, బి.తాండ్రపాడుకు చెందిన ఆకెపోగు వరలక్ష్మి వృషభాలు మూడవ బహుమతి రూ.30 వేలు, బండిఆత్మకూరు మండలం, కానాలకు చెందిన గుండం చెన్నరెడ్డి ఎద్దులు నాల్గవ బహుమతి రూ.25 వేలు, నాగరకర్నూలు జిల్లా, రాయలచెరువు జయచంద్రారెడ్డి, ప్యాపిలికి చెందిన జె.కృష్ణ వృషభాలు (విడిజత) ఐదవ బహుమతి రూ.20 వేలు, వంశీకృష్ణ, రాయపురం నల్లారెడ్డి వృషభాలు(విడిజత) ఆరవ బహుమతి రూ.15 వేల చొప్పున దక్కించుకున్నాయి. ఆ తర్వాతి వృషభాలకు రూ.10వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. పోటీలకు వాడాల రామనాయుడు, అబ్దుల్‌కలామ్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, మాజీ సర్పంచు శ్రీరెడ్డి చెన్నారెడ్డి, ఎంపీపీ తిప్పన్న, సర్పంచు బ్రహ్మయ్య, నాయకులు ఎస్.నాగరాజు, కె.రామకృష్ణ, ఇమ్మానుయేల్, సురేష్, జె.నాగరాజు, గౌండ పెద్ద రాముడు, సునీల్, గఫార్, షరీఫ్‌మియ, అన్నయ్యలు తదితరులు పాల్గొన్నారు.

దినసరి వేతనాలు పెంచండి

- డీపీఓకు వినతి పత్రం అందించిన సిబ్బంది



డీపీఓకు వినతి పత్రం అందిస్తున్న తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ సిబ్బంది

కర్నూలు(అర్బన్): కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీలో గత 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న తమకు దినసరి వేతనాలను పెంచాలని తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ సిబ్బంది కోరారు. ఈ మేరకు వారు మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ 24 గంటలు గ్రామ పంచాయతీ పరిధిలో దినసరి వేతనాలపై పనిచేస్తున్న తమకు ప్రస్తుతం రోజుకు రూ.330 ఇస్తున్నారని, దీంతో కుటుంబాలను పోషించుకోవడం ఇబ్బందిగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇస్తున్న వేతనాన్ని రూ.573కు పెంచాలని కోరారు. దీనిపై డీపీఓ మాట్లాడుతూ ఇంకా కోడుమూరు గ్రామ పంచాయతీ నుంచి ప్రపోజల్స్ రాలేదని, ప్రపోజల్స్ వచ్చిన వెంటనే గ్రామ సర్పంచు, కార్యనిర్వహణాధికారితో మాట్లాడి వేతనాలను పెంచేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డీపీఓను కలిసిన వారిలో సిబ్బంది జి. మాధవస్వామి, ఎ. ఆంజాద్, ఆర్ శేఖర్, ఈరన్న, జి. నాగరాజు, గుంటిప్ప తదితరులు ఉన్నారు.

మొక్కుబడిగా గూడూరు మండల మీట్



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సునీత



మండల మీట్‌కు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

కోడుమూరు రూరల్: గూడూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మొక్కుబడిగా సాగింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సునీత అధ్యక్షతన ఎంపీడీఓ శివనాగప్రసాద్ ఈ సమావేశం నిర్వహించారు. అయితే, సమస్యలపై పెద్దగా చర్చ జరగకపోవడంతో స్థానిక ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులంతా గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా నీటి సమస్య ఉంటే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. మునగాల సర్పంచు గోపాల్ మాట్లాడుతూ తమ గ్రామంలో పొలాలకు వెళ్లే రస్తాలు అధ్వానంగా ఉన్నాయని, వర్షాకాలం నాటికైనా ఉపాధి హామీ పథకం కింద వాటిని బాగు చేయాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ రామాంజినేయులు, ఏపీఓ రామేశ్వరమ్మ, ఎంఈఓ సునీలమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, ఎలక్ట్రికల్ ఏఈలు సన, నాగరాజు, శ్రీనివాసనాయక్ తదితరులు వారి శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హోరాహోరీగా పొట్టేళ్ల పోటీలు



తలపడుతున్న పొట్టేళ్లు

కోడుమూరు రూరల్: మండలంలోని ముడుమలగుర్తిలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం సందర్భంగా మంగళవారం పొట్టేళ్ల పోటీలు నిర్వహించారు. కర్నూలుతో పాటు ఇతర జిల్లాల నుంచి మొత్తం 18 పొట్టేళ్లు రాగా కోడుమూరు మండలంలోని పులకుర్తికి చెందిన వీరాంజనేయులు పొట్టేలు విజేతగా నిలిచింది. అలాగే 2వ స్థానంలో ముడమలగుర్తికి చెందిన బైరవ పొట్టేలు, 3వ స్థానంలో నంద్యాల రాక్షసి పొట్టేలు, 4వ స్థానంలో ఆంధ్రకట్ల డాన్ పొట్టేలు, 5,6వ స్థానాల్లో అనంతపురం జిల్లాకు చెందిన శంబాజీ పొట్టేలు నిలిచాయి. గెలుపొందిన పొట్టేళ్ల యజమానులకు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.5వేలు, రూ.4వేల చొప్పున నగదు బహుమతులను దాతల సహకారంతో పూజారి రంగన్న స్వామి అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సురేంద్రరెడ్డి, కురువ రవి, సురేష్, గొల్ల ప్రసాద్, గ్రామపెద్దలు, భక్తబృందం సభ్యులు పాల్గొన్నారు.

బురాన్‌దొడ్డిలో ఘనంగా పెద్దమ్మ దేవర



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ



కుంభం కాగులతో ఊరేగింపు

సి.బెళగల్: మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామంలో గ్రామ దేవత శ్రీ పెద్దమ్మ దేవరను ఘనంగా నిర్వహించారు. మద్దికెర, ఎం.అగ్రహారం, వైఎస్సార్ కడప జిల్లా మంగంపేట తదితర ప్రాంతాలకు చెందిన అమ్మవారి భక్తులు మంగళవారం గ్రామానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా అమ్మవారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. తర్వాత ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం గ్రామ చివరి నుంచి అమ్మవారి ఆలయం వరకు కుంభం కాగులతో భారీ ఊరేగింపు చేపట్టారు. అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొల్ల సోమన్న, గొల్ల గోవిందమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న గ్రీన్‌కో సూపర్‌వైజర్ ప్రభాకర్

ఓర్వకల్లు : కార్మికులు చెడు వ్యసనాలకు దూరంగా వుండి, వచ్చిన సంపాదనతో కుటుంబాలను పోషించుకోవాలని ఈగల్ సెల్ ఎస్‌ఐ సుజన్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని గ్రీన్‌కో కంపెనీలో పనిచేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కర్నూలుకు చెందిన ఈగల్ సెల్ పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఎస్‌ఐ సుజన్‌కుమార్ మాట్లాడుతూ.. గ్రామాలలో మద్యం, గంజాయి, సారా, జూదం వంటి వ్యసనాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కంపెనీలోని కార్మికులకు చెడు వ్యసనాల వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. అనంతరం కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రీన్‌కో ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ ప్రభాకర్, ఎస్‌ఐ సునీల్‌కుమార్, ఎక్సైజ్ సీఐ సుభాషిణి, ఈగల్ సిబ్బంది ఎలీషా, మాసూంవలి, ఫర్హత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.